


## ఈ వారం తెలుగు పుస్తకం

# వల్లంపాటి 'విమర్శాశిల్పం'

డా॥ కడియాల రామమోహన రాయ్




Title: Vimarshaa Shilpam
Subject: LITERARY CRITICISM
Year of Publication: 2002
Price: USD $ 1.15

తెలుగు సాహిత్యంలాగే తెలుగు సాహిత్య విమర్శ కూడ శాఖోపశాఖలుగా ఎదిగింది. తెలుగునకున్న విమర్శదీపం చిన్నది అని కొందరంటారు గాని యీ మాట అనేది తన రచనకు తానాశించిన ప్రశంస రాలేదని అసంతృప్తి చెందినవారు. మరికొందరు కూడ వున్నారు - వీళ్ళు తెలుగులో ఉత్తమ రచన వచ్చినా దాన్ని విశ్వ సాహిత్యంలో మరి కొన్ని రచనలతో పోల్చి, చప్పరించేస్తుంటారు. వాస్తవానికి సాహిత్యమూ విమర్శా కూడ వెలుగునీడలే.

భారత సాంస్కృతిక పునరుజ్జీవన దశలో తెలుగు వ్యాఖ్యాన సంప్రదాయం ఆంగ్ల సాహిత్య ప్రభావంతో విమర్శా మార్గానికి మళ్ళింది. ప్రథమాంధ్ర సాహిత్య విమర్శకులు కందుకూరి వీరేశలింగం రాగద్వేషాలకు అతీతులేమీ కారు. 'విగ్రహతంత్ర విమర్శనము' (1875) లో దోషాలను గుర్తించినంతగా గుణాలను పరిగణనకు తీసుకోలేదు.

తెలుగు సాహిత్య విమర్శకొక సుస్పష్ట రూపం వచ్చింది, కట్టమంచి రామలింగారెడ్డి గారి ' కవిత్వ తత్త్వ విచారము (1914) తోనే. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి 'వేమన' ప్రసంగాలు సాహిత్య విమర్శకు రాచమార్గం ఏర్పరచాయి. సత్యాన్వేషణ, సమదర్శనం యీ యిద్దరి విమర్శలలో ప్రస్ఫుటంగా కనిపించే గుణాలు. ఇద్దరూ మహా సాహసులు. నిజాన్ని నిర్భయంగా చెప్పటానికి వీళ్ళు వెనుదీయలేదు.

చరిత్ర పరిశోధన, ప్రాచీన గ్రంథ పరిష్కరణ, కవుల కాల నిర్ణయాలు, కావ్యావతారికలు, సాహిత్య విమర్శను కొంత పుంతలు తొక్కించాయి. ప్రాచీనాంధ్ర గ్రంథాలను వాటి సంస్కృత మూలాలతో పోల్చి చూడాలన్న తపన హెచ్చింది. కవి కులాన్ని,శాఖను తెలుసుకోవాలన్న జిజ్ఞాస (నన్నయ వైదికియా నియోగియా?) తగ్గుముఖం పట్టింది. శబ్దాల సాధుత్వాసాధుత్వాల గురించిన చర్చ విమర్శకుల పాండిత్య ప్రదర్శనగా మారింది.

సోవియట్ రష్యాలో వచ్చిన మార్పులు విద్యావంతులను ఆకర్షించాయి. మార్క్సిస్టు చింతన సమాజాన్ని ప్రాభావితం చెయ్యసాగింది. కట్టమంచి వారి సాంఘిక విమర్శ మరింత పదునెక్కి 1930-40 మధ్యకాలంలో మార్క్సిస్టు విమర్శగా రూపొందింది. మద్దుకూరి చంద్రశేఖరరావుగారిని తెలుగులో మార్క్సిస్టు విమర్శకు ఆద్యునిగా సాహిత్య చరిత్రకారులు తలుస్తున్నారు.

సమాజానికి సాహిత్యానికి, సాహిత్యానికి విమర్శకూ వున్న సంబంధాన్ని 'విమర్శాశిల్పం'లో శ్రీ వల్లంపాటి వెంకట సుబ్బయ్య చక్కగా వివరించారు. వీరి 'కథాశిల్పం', 'నవలా శిల్పం' తెలుగు సాహిత్య విమర్శకు వెలుగును ప్రసాదించాయి. మార్క్సిస్టు విమర్శకు వీరి రచనలు పుష్టిని చేకూర్చాయి.

సాహిత్య విమర్శ అంటే ఏమిటి? దాని ప్రయోజనమేమిటి? విమర్శ ఎన్ని విధాలుగా వుంటుంది? అందులో ఏది ఉత్తమమైనది. అనే మౌలిక అంశాలను తెలిపే పుస్తకాలు కొన్ని వచ్చాయి. ' సాహిత్యశిల్ప సమీక్ష' ( పింగళి లక్ష్మీకాంతం) ' సాహిత్య దర్శనం( కె.వి.ఆర్.నరసింహం)' సాహిత్య సౌందర్య దర్శనం' ( చర్ల గణపతి శాస్త్రి) వీటిలో ప్రముఖమైనవి. ఆధునిక విమర్శ రీతులను సుబోధకమైన రీతిలో వివరించిన ఉత్తమ గ్రంథం 'విమర్శాశిల్పం'.

"జీవితం సాహిత్యాన్ని , సాహిత్యం సాహిత్య విమర్శనూ ప్రభావితం చేసుకుంటాయి. అంతే కాకుండ సాహిత్యవిమర్శ సాహిత్యాన్నీ, సాహిత్యం జీవితాన్ని ప్రభావితం చేసుకుంటాయి."

"సాహిత విమర్శ ప్రభావం సాహిత్యాన్ని దాటి సరాసరి జీవితం మీద పడుతుంది. మార్క్స్, ఏంగెల్స్ రూసో, వాల్టేర్ మొదలైన సామాజిక తత్త్వవేత్తలు రాసిన సాహిత్య విమర్శ ప్రభావం ఆనాటి జీవితం మీద ఎటువంటి ప్రభావాన్ని చూపించిందో కొంతమంది మేధావులు సోదాహరణంగా చూపించారు". సాహిత్య విమర్శ శక్తియుక్తులను వల్లంపాటి సరిగా అంచనా వేశారు.

'సారస్వత స్థితిని చేరుకున్న ప్రతి భాషలో ఉద్యమాలు ఉంటాయి. కాని సామాజిక భావాల మధ్య సంఘర్షణ తెలుగు సాహిత్యంలో ఉన్నంత తీవ్రంగా మరే ఇతర భారతీయ సాహిత్యంలోనూ లేదేమోనని" సందేహాన్ని వెలిబుచ్చారు. తెలుగు సాహిత్యాన్ని ఆధునిక కన్నడ సాహిత్యంతో పోల్చి అక్కడ సామాజిక భావాల మధ్య సంఘర్షణ లేకపోవటానికి కారణాలను వల్లంపాటి విశ్లేషించారు.

తెలుగుదేశం ఉద్యమాల నేల అనటానికి సందేహించనక్కరలేదు.

రచయితలు కొందరు అంతర్ముఖులై సమాజంతో సంబంధం లేని మనస్సులోని మారుమూల కోణాలను వ్యక్తం చేసినప్పుడు అవి కూడ ఉత్తమ రచనలు అయ్యే అవకాశం వున్నది అని కొందరు విమర్శకులు తలుస్తారు." మానవునికి బహిరంగంతో ఎలాంటి సంబంధమూ లేని అంతరంగం ఉంటుందని భావించటం కూడ సరైన ఆలోచన కాదంటారు వల్లంపాటి.

'జీవితానికి అర్థం లేదు. జీవితమంతా ఘటన' అని యథాస్థితిని సమర్పించే ఆధ్యాత్మిక సంప్రదాయ వాదనను యీయన తిరస్కరించారు. అర్థం లేనట్టుగా అప్పుడప్పుడూ కనిపించే జీవితానికిఅర్థస్ఫూర్తిని ఇవ్వటానికి ప్రయత్నించటం రచయిత బాధ్యత" అని వీరి విశ్వాసం.

"ఎంతో విస్తృతమైన జీవితానుభవమూ, రచనా నైపుణ్యమూ వున్న రచయితైనా జీవితాన్ని సంపూర్ణంగా చిత్రించలేడు" . మానవ జీవితంలో ఉన్న అన్ని పొరలను గురించీ, అంతస్తులను గురించీ, ముఖాలను గురించీ ఒకే రచయిత సమగ్రంగా తెలుసుకోవటం సాధ్యంకాదు. రచయిత ఏ అంశాన్ని గురించి రాస్తున్నడో దాన్ని గురించి అతనికి సమగ్రమైన అనుభవమూ దృక్పథమూ ఉన్నాయా అని మాత్రమే పాఠకుడు విమర్శకుడూ ఆలోచించాలి" - ఈ అంశాన్ని ఇంతకు ముందు తెలుగు విమర్శకులెవ్వరూ ప్రస్తావించలేదు. వల్లంపాటి చెప్పిన యీ అంశం తప్పక గుర్తుపెట్టుకోవలసినది.

వల్లంపాటి కొన్ని వివాదాస్పదమైన అంశాలను గూడ తెలిపారు. మన ప్రాచీన ఆలంకారికులెవ్వరూ సమాజానికీ, సాహిత్యానికీ వున్న వివిధమైన సంబంధాలను చర్చించలేదు. విభిన్నమైన భావజాలాలకూ వాస్తవికతకూ సాహిత్యాన్ని దగ్గరగా తీసుకువచ్చే ప్రయత్నం చేయలేదు. వేదోపనిషత్తుల భావజాలాన్నీ పురాణ

కథలనూ దాటి భారతీయ సాహిత్యం విభిన్న మార్గాలలో విస్తరించలేకపోయింది. ఈ అభిప్రాయంతో ఏకీభవించలేం, కావ్య ప్రయోజనాలలో రసానందాన్ని ఆశించిన ఆలంకారికులు 'వ్యవహార విదే' అనే దానిలో సమాజంలో వ్యక్తి ప్రాముఖ్యాన్ని చెప్పకనే చెప్పారు. విభిన్నమైన భావజాలాలు ప్రాచీన భారతీయ గ్రంథాలలో వున్నాయి. రామరావణుల భావాలొకే విధమైనవి కావు గదా! మహాభారత పాత్రలలో సంక్లిష్టత పుష్కలంగా వున్నది గదా!

జగన్నాథ పండితరాయల కాలానికి ఉజ్జ్వలమైన తెలుగు సాహిత్యం వున్నది. అతడు దాన్ని పట్టించుకోలేదన్నారు వల్లంపాటి. అసలు జగన్నాథుడు ఆంధ్ర దేశంలో పుట్టి పెరిగాడన్నది పండితుల విశ్వాసమే. ఆయన ఉత్తర భారతదేశానికి వలస పోయిన తెలుగువాడు కావచ్చు. ఆయనకు తెలుగు లిపి, సాహిత్యంతో పరిచయం వుందని చెప్పలేం. అటువంటప్పుడు పట్టించుకోలేదనటం న్యాయం కాదేమో!

18,19 శతాబ్దాలలో భారతదేశంలో సాహిత్య శాస్త్రాన్ని గురించిన నూతన సిద్ధాంతాలు ఆవిర్భవించలేదని వల్లంపాటి వారు తెల్పిన అంశం యథార్థమే.

అరసికునికి, రసికునికి-విమర్శకుడికి గల తేడాను యీాయన చక్కని ఉదాహరణతో తెలిపారు.

విమర్శకుడికి వుండవలసిన అర్హతలను గురించి చెప్పే చోట వల్లంపాటివొక పొరపాటు పడ్డారు. "అభినవ గుప్తుడు తాను రాసిన 'కావ్యస్వరూపం' అన్న గ్రంథంలో సహృదయుణ్ణి ఇలా నిర్వచించాడు " (10 వపేజీ) అన్నారు.

అభినవగుప్తుడు 'కావ్యస్వరూపం' అన్న గ్రంథం రాయలేదు.

సాహిత్య అకాడెమీ 1969 లో ప్రచురించిన 'కావ్యస్వరూపమ్' అనే సంకలన గ్రంథంలో నుంచి సహృదయ లక్షణాలను గ్రహించిన వల్లంపాటి ఆ పుస్తకానికి వున్న శీర్షికను చూసి అభినవ గుప్తుని గ్రంథంగా పొరపడి వుంటారు.

"విమర్శకుడు రచనను రచయిత దృక్పథం నుంచి అర్థం చేసుకుని తన దృక్పథం నుంచీ ఆలోచించి విలువ కడతాడు. కానీ అది తప్పనీ రచనను రచయిత దృక్పథం నుంచి మాత్రమే విలువ కట్టాలని భావించేవారు లేకపోలేదు. వీరి అభిప్రాయంలో సామంజస్యం ఏమాత్రమూ లేదు. దృక్పథాన్ని కలిగివుండే అర్హత రచయితకు మాత్రమే కాకుండ విమర్శకుడికి కూడ వుండాలి" అన్న వల్లంపాటి అభిప్రాయం విలువైనది. సహృదయులు తప్పక తలదాల్చవలసినది.

ఆరోగ్యకరమైన మనసుండడం విమర్శకుడికి వుండవలసిన ముఖ్యమైన అర్హతగా వల్లంపాటి తలచారు. "స్వాదు పరాఙ్ముఖులు కాని వారెల్లరు కావ్య పఠన యోగ్యులు. అయినను మహాకవి మార్గగాములు పద్యగ్రథన రహస్యవేత్తలు, ప్రాకృతీచీ సాహిత్య సమీక్షాదక్షులు, కామ కలా ప్రవీణులు ఆరోగ్యవంతులునగు ఆర్ద్రహృదయులే స్వారస్యనిర్ణాయకులు" అని తల్లావఝ్ఝుల శివశంకరశాస్త్రి 'హృదయేశ్వరి' కావ్య'వ్యక్తవ్యము' (1925) లో తెలిపారు. విమర్శకుని బాధ్యతలను ఎలియట్ -"elucidation of works of art and the corrrection of taste" అని తెలిపారు. పాఠకుని అభిరుచిని సరిదిద్దటం చాలా కష్టసాధ్యమైన ప్రయత్నమని అంటూ అందుకు తోడ్పడ్డ తెలుగు సాహిత్య విమర్శకులలో కె.వి.ఆర్, 'రా.రా' ముఖ్యమైన వారినిగా పేర్కొన్నారు. పాఠకుల అభిరుచిని

సరిదిద్దటానికి ప్రయత్నించిన వారిలో వీరేశలింగం, కట్టమంచి, రాళ్ళపల్లి, ఉమాకాన్త విద్యాశేఖరులు, జి.వి.కృష్ణరావు, ఆర్.ఎస్.సుదర్శనం కూడ ముఖ్యులే. సమాజంలో కొన్ని విలువలలో మార్పు వస్తూ వుంటుంది. అటువంటప్పుడు సాహిత్యంలో మార్పు పునర్మూల్యాంకనం తప్పనిసరి. "నన్నయ భట్టు తన భారతావతారికలో తన పోషకుడైన చాళుక్యాన్వయాభరణుడు విప్రకులము నెల్ల బ్రోచుచు, అగ్రజన్ములకు అనుగ్రహమున చారుతర మహాగ్రహారము లిచ్చుచు సమస్త వర్ణాశ్రమ ధర్మ మహామహిమతో వుండేవాడని" చెప్పాడు. ఈ అభిప్రాయాన్ని మెచ్చుకునేవారు ఈ కాలంలో ఎక్కువ మంది వుండరు.

చాతుర్వర్ణ వ్యవస్థ, బ్రాహ్మణాధిక్యత, సమాజంలో స్త్రీ స్థానం, ఆధ్యాత్మికత పేరుతో చెలామణి అవుతున్న మెట్ట వేదాంత ధోరణులు- వల్లంపాటి వారన్నట్లు-కందుకూరి, గురజాడ కాలానికి చర్చనీయాంశాలయ్యాయి. ఇంకా పండితుడు పండితుడి కోసం మాత్రమే రాసే కాలం పోయి, సామాన్యుడు సామాన్యుడి కోసం రాసే కాలం వచ్చింది.

సాహిత్య విమర్శను వల్లంపాటి "ఒక ప్రాపంచిక దృక్పథాన్ని కలిగిన విమర్శకుడు నిర్వహించే సామాజిక బాధ్యతగా తలచడం సమంజసంగా వున్నది.

'సాహిత్యదర్పణం' గ్రంథ కర్త విద్యానాధుడని పేర్కొన్నారీయన(16 పేజీ) !ఇది పొరపాటు. 'సాహిత్య దర్పణం' విశ్వనాథకృతం.

సమాజంలో ఆర్థిక పునాది మాత్రమే ఉపరితలమైన సాహిత్యం, కళలు, రాజకీయాలను ప్రచారం చేస్తుందనేది మార్క్సిజం చెప్పినట్లుగా కొందరు ప్రచారం చేస్తుంటారు. కాని మార్క్స్ ,ఏంగెల్స్‌లు ఆర్థిక పునాది ప్రాముఖ్యతను, శక్తిని నొక్కి చెప్పారే గాని ఆర్థిక పునాది మాత్రమే ప్రభావితం చెయ్యగలదని చెప్పలేదని వల్లంపాటి మార్క్స్, ఏంగెల్స్‌ల రచనల ఆధారంగా నిరూపించారు.

మార్క్స్ ఏంగెల్స్‌ల వస్తు శిల్పాలలో వస్తువుకు అత్యంత ప్రాముఖ్యమిచ్చారు. వస్తువుతో సంబంధం లేని శిల్పానికి విలువలేదన్నారు. వాస్తవిక వాదాన్ని అత్యుత్తమమైనదిగా వీరు పరిగణించారు.

సోవియట్ రష్యాను లెనిన్ పరిపాలించిన కాలంలో కళాసాహిత్య రంగాలలో ప్రభుత్వ జోక్యం పెరిగింది. 'సామ్యవాద వాస్తవికత' సోవియట్ కళావిధానంగా ప్రకటించబడింది. కళావిలువలు దరిదాపుగా లేని నవలలూ కథలూ రావటం ఎక్కువైంది. మార్క్సిస్టు సిద్ధాంతానికీ విమర్శకూ లెనిన్, స్టాలిన్ విధానాలు " చేసిన అపకారం శాశ్వతమైనది"గా వల్లంపాటి తలచారు- ఇంతవరకూ తెలుగులో మార్క్సిస్టు విమర్శకు పూనుకున్న వారెవరూ యీ విషయాన్ని తెల్పలేదు. మార్క్సిస్టు విమర్శకులలో తన ప్రత్యేకతను వల్లంపాటి పై విషయాన్ని అంగీకరించటం ద్వారా చాటుకున్నారు. 'పార్టీయే భావజాలం, భావజాలమే పార్టీ'అనే ఆలోచనా విధానం సాహిత్యానికి చాల హాని చేయగలదని ఈ సందర్భంగా వల్లంపాటి హెచ్చరించారు.

ఒక ప్రాంతంలో ఒక కాలంలో జీవించిన వారందరి జీవితానుభవం అందరిదీ ఒకటే రకంగా ఉంటుందన్న పరికల్పన తప్పు అని వల్లంపాటి తలుస్తారు. ఈ విషయాన్ని యీయన వివరించిన తీరు ఆసక్తికరమైనది.

"రచయిత వ్యక్తిగత జీవితాన్ని ఆధారం చేసుకుని రచనను వ్యాఖ్యానించటం చాల బలహీనమైన విమర్శా విధానం" అంటారు వల్లంపాటి. కాని బ్రిటిష్‌వారి సాహిత్యవిమర్శలో 'బయోగ్రాఫికల్ క్రిటిసిజం' కు ప్రాధాన్యం వున్నది. జాన్సన్ **"Lives of the English poets"** కి ఆదరం ఇప్పటికీ ఉన్నది.

"సంస్కృత అలంకార శాస్త్రంలో రచయిత కేంద్రిత విమర్శలేదు .... కవుల జీవితాలను గురించి, వ్యక్తిత్వం గురించీ మనకు తెలిసింది దాదాపు శూన్యం. ఇరవయ్యవ శతాబ్దంలో రచయిత జీవితానికీ రచనలోని వస్తువుకూ వున్న సంబంధమేమిటి? అన్న ప్రశ్నలు అప్రస్తుతమైపోయాయి. రచన ఏం చెబుతోంది? అనేది ప్రధానాంశంగా విమర్శ సాగుతున్నది.

"మహా సామ్రాజ్యాల ఛత్రచ్ఛాయలో ప్రారంభమైన సంస్కృత అలంకార శాస్త్రం మహాసామ్రాజ్యాలు కనుమరుగై పోగానే తానూ కనుమరుగై పోయింది." అన్న వల్లంపాటి అభిప్రాయం పునరాలోచింపదగింది. రస సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన నాట్యశాస్త్రం మహా సామ్రాజ్యపు ఛత్ర ఛాయలో రచింపబడినదని చెప్పలేం.

రససిద్ధాంత వివరణలో వర్ణ దృష్టీ, వర్గ దృష్టీ లింగ వివక్షా వున్నాయని వల్లంపాటి అన్నారు. ఆలంకారికులు ఉదాహరణగా తీసుకునే పాత్రలు బ్రాహ్మణ క్షత్రియ వర్గాలకు చెందినవేగాని నిమ్న వర్ణాల, దళితుల జీవితాలకు ఎటువంటి ప్రాధాన్యమూ లేదన్నారు.

వల్లంపాటి 'విమర్శాశిల్పం' లో పాశ్చాత్య సాహిత్య మీమాంస అనే అధ్యాయం మిక్కిలి విలువైనది.

సాహిత్య విమర్శ పెద్దమనిషి తరహాగా ప్రశాంత చిత్తంతో విమర్శ రాయాలని అది మరీ సాంకేతికంగా సంకేత పదభూయిష్ఠంగా వుండకూడదన్న సిడ్నీ అభిలాషయే ఇప్పటికీ బ్రిటిష్ సాహిత్య విమర్శను నడిపిస్తున్నదని వల్లంపాటి తెలిపారు.

"ఆర్నల్డ్ అభిప్రాయం ప్రకారం విమర్శకుడు సమాజానికి నిబద్ధుడు. ప్రపంచంలోని ఉత్తమోత్తమ భావాలను గుర్తించి, వాటిని ప్రచారం చేసి నూతన సృజనకు అవసరమైన బౌద్ధిక వాతావరణాన్ని విమర్శకుడు సృష్టించాలి. దాన్ని రచయిత ఉపయోగించుకోవాలి" అని ఆర్నల్డ్ అభిప్రాయాలను వల్లంపాటి సుబోధకంగా చాకచక్యంగా వివరించారు.

"ఆర్నల్డ్ విమర్శకుడు నిర్లిప్తతను **(disinterestedness)** అలవరచుకోవాలన్నాడు. దీన్ని అతడు భారతీయుల సుగుణమైన 'స్థితప్రజ్ఞత'**(detachment)** అలవరచుకోవాలన్నాడు"-వల్లంపాటి, ఆర్నల్డ్ విమర్శవిధానం యాంత్రికమైనదంటున్నారు. గొప్ప కవిత్వం ఆర్నల్డ్ అభిమానించే ఐదారుగురి కవిత్వం లాగే ఉంటుందనుకోవటం, ఉండాలనుకోవటం సరికాదన్నారు" కాలాన్ని బట్టి మారుతున్న మానవ సంబంధాలను బట్టి సాహిత్యంలో వస్తువులూ అభివ్యక్తీకరణ పద్ధతులూ నిరంతరం మారుతుంటాయి. విభిన్న కాలాలకు చెందిన గొప్ప కవిత్వం ఒకే రకంగా వుండదు" అని వల్లంపాటి తలచారు. అయినా ఆర్నల్డ్‌కు ప్రపంచ సాహిత్య విమర్శలో గొప్ప స్థానం శాశ్వతంగా వుంటుందని వల్లంపాటి ఆయనకు జేజేలు పలికారు.

ఆధునిక సాహిత్య విమర్శ హెన్రీ జేమ్స్ తో ప్రారంభమైనట్లు వల్లంపాటి తలుస్తున్నారు కాని ఆంగ్ల సాహిత్య విమర్శ రీతుల్ని నిశితంగా పరిశీలిస్తే ఆర్నల్డ్‌నే ఆధునిక విమర్శకు ఆద్యునిగా పరిగణించటం సమంజసంగా

వుంటుంది. ఈ అధ్యాయంలో వల్లంపాటి **New criticism, structuralism,post-structuralism, deconstructionists, post-modernism** లను తెలుగు పాఠకులకు పరిచయం చేశారు.

ఇందులో యీాయన **stylistics** ను కూడ పరిచయం చేశారు "స్వతంత్రమైన విమర్శావిధానం కాక పోయినా సాహిత్య విమర్శకు గొప్పగా దోహదం చేసిన శాస్త్రం శైలీశాస్త్రం"అన్నారు వల్లంపాటి. శైలి మీద కథావస్తువు, ప్రాంతం, ప్రక్రియ, రచయిత వ్యక్తిత్వ ప్రభావాలు ఉంటాయన్నారు.

" సాహిత్య ప్రక్రియల పుట్టుకకూ, అవి పుట్టిన సామాజిక సందర్భాలకూ మధ్య వున్న సంబంధాన్ని లేదా వైరుద్ధ్యాన్ని మార్క్సిస్టు సాహిత్యవిమర్శ మాత్రమే వివరించగలదు" అని వల్లంపాటి మార్క్సిస్టు విమర్శ విశిష్టతను కొనియాడుతూనే దానికి గల పరిమితులను కూడ తెలిపారు. శైలి, దృష్టికోణం, కంఠస్వరం, పదచిత్రాలు, కవిత్వం, ఛందస్సు మొదలైన శిల్పాంశాల విశ్లేషణకు మార్క్సిస్టు సాహిత్య దృక్పథం అంటూ ఏమీ లేదు".

"భారతీయ అలంకార శాస్త్రం కూడ సమగ్రమైన సాహిత్య సిద్ధాంతంగా ఉపయోగపడదు" అని యీాయన ఖండితంగా తెలిపారు.

"తెలుగు సాహిత్యం ఎదిగినంత స్థాయికి తెలుగు సాహిత్య విమర్శ ఎదగలేకపోయింది" అన్న వల్లంపాటి వ్యాఖ్య అభ్యంతరకరమైనది. తెలుగు సాహిత్యం ఏ స్థాయిలో వున్నదో సాహిత్య విమర్శ కూడ అదే స్థాయిలో వున్నదని నా నిశ్చితాభిప్రాయం.

back to book of the week home page

❖ ఈ విశేష సమీక్షా వ్యాసం శ్రీ చిట్టి శర్మ (న్యూ జెర్సీ- యు.ఎస్.ఎ) వదాన్య సౌజన్యంతో అందించబడింది.